# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 143

VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: మంగళవారం 16 జూన్ 2026





2వ పేజీలో...




2వ పేజీలో...




2వ పేజీలో...




**ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు.ఈరోజు(సోమవారం) సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు.**

**హైదరాబాద్, సమయం ప్రతినిధి :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

**మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..**

మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. చీూజ ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు

**మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..**

రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం చీూజ అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి చీూజ ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**కేటీఆర్ చెప్పిందే కిషన్‌రెడ్డి చేస్తున్నారు..**

కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలని.. ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.




2వ పేజీలో...







# సంపాదకీయం

## మోదీ వల.. విపక్షం విలవిల

రాజకీయాలలో విలువలు పతనమయ్యాయి. 'జో జీతేగా వహీ సికందర్' అన్నట్టుగా పరిస్థితి మారింది. ఎన్డీయే నాయకుడిగా ప్రధాని మోదీ బాహుబలిగా ఎదగగా, ప్రతిపక్ష ఇండియా కూటమి సమర్థ నాయకత్వం కొరవడి మోదీని ఢీకొనలేక డీలాపడిపోయింది. ప్రధాని మోదీ రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేని ఇండియా కూటమి తన ఉనికిని చాటుకోవడానికి సతమతమవుతోంది. ప్రధాని మోదీ దేశ ప్రజలు, ముఖ్యంగా యువత మనోభావాలను పసిగట్టి అందుకు తగిన వ్యూహాలను రూపొందించుకొని ఎన్నికల్లో విజయాలు సాధిస్తుండగా, ఇండియా కూటమి నేతలు మాత్రం పాత చింతకాయ పచ్చడి ఆలోచనలతోనే అడుగులు వేస్తున్నారు. దీంతో ఇండియా కూటమి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రాల్లో బలమైన నేతల కోసం మోదీ అన్వేషణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే హరీశ్ రావు కోసం తెర వెనుక ప్రయత్నాలు కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డిని తనతో చేతులు కలపాలని బహిరంగంగానే ఆయన కోరారు. ఈ మాట సరదాగా అన్నట్టు పైకి అనిపించినా ప్రధాని ఆంతర్యం అర్థం కావాల్సిన వారికి అర్థమైంది. నిన్నటి వరకు కేంద్రంలో బీజేపీని గద్దె దించుతామని గర్జించిన దీదీ మమతా బెనర్జీ ఇప్పుడు తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు తృణమూల్‌ను కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడానికి కూడా సిద్ధపడుతున్నట్టు వార్తలొస్తున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్‌లోనే ఉండిన ఆమె ఆ పార్టీతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడం గమనార్హం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏకబిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నాయకుడిగా నరేంద్ర మోదీ దేశ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సంబరాలు జరుపుకోగా, మోదీని నిలువరించడం ఎలా? అని ప్రతిపక్ష ఇండియా కూటమి తల పట్టుకుంటోంది. నిజానికి భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కుమార్తె ఇందిరా గాంధీ... మోదీకంటే ఎక్కువ రోజులు ప్రధానమంత్రులుగా కొనసాగారు. నెహ్రూ సైతం మూడు పర్యాయాలు వరుసగా ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ వయోభారం, అనారోగ్య సమస్యలతో ప్రధానమంత్రిగా ఉండగానే కన్నుమూశారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే హత్యకు గురయ్యారు. ఈ కారణంగా ప్రధాని మోదీ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. రాజకీయాలలో ఈ శతాబ్దం నాది అని మోదీ సగర్వంగా చెప్పుకోగలుగుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజులతో పోల్చితే వర్తమాన రాజకీయాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. రాజకీయాలలో విలువలు పతనమయ్యాయి. 'జో జీతా వహీ సికందర్' అన్నట్టుగా పరిస్థితి మారింది. ఎన్డీయే నాయకుడిగా ప్రధాని మోదీ బాహుబలిగా ఎదగగా, ప్రతిపక్ష ఇండియా కూటమి సమర్థ నాయకత్వం కొరవడి మోదీని ఢీకొనలేక డీలాపడిపోయింది. ప్రధాని మోదీ రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేని ఇండియా కూటమి తన ఉనికిని చాటుకోవడానికి సతమతమవుతోంది.

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం ఎలా? అని ఇదే భారతీయ జనతా పార్టీతో సహా అనేక ప్రతిపక్షాలు తల పట్టుకోగా, ఇప్పుడు మోదీ శక్తియుక్తుల ముందు కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు నిస్సహాయంగా మిగిలాయి. ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ నియంతలా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం బలపడటంతోపాటు ఆమె దేశంలో అత్యవసర పరిస్థితిని విధించడంతో నాడు ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో రైటిస్టులు, లెఫ్టిస్టులు ఏకమై జనతా పార్టీకి పురుడు పోశారు. 1977 ఎన్నికల్లో జేపీ ఆధ్వర్యంలో జనతా పార్టీ ఇందిరా గాంధీని ఓడించి మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే, నాయకుల మధ్య విభేదాల కారణంగా జనతా పార్టీ ప్రభుత్వం ఎంతో కాలం నిలవలేదు. ఇందిరా గాంధీ మళ్లీ అధికారంలోకి వచ్చారు. అయితే, పదవీకాలం పూర్తి కాకుండానే ఆమె తన సొంత అంగరక్షకులైన సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ చేతిలో హత్యకు గురయ్యారు. ఇది చరిత్ర!

### ఎవరు గొప్ప?

తొలి ప్రధాని నెహ్రూకంటే ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గొప్పవారా? అంటే ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. వర్తమాన రాజకీయాలలో మోదీ మహాబలుడని మాత్రం చెప్పవచ్చు. ఒక నాయకుడు మూడు ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత బలహీనపడటం, ప్రతిపక్షాలు బలం పుంజుకోవడం సహజం. అయితే ఇప్పుడు దేశ రాజకీయాలలో ఆ పరిస్థితి లేదు. ప్రధాని మోదీ గత ఎన్నికల్లో కొంత బలహీనపడినా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మరింత బలపడ్డారు. ప్రధాని మోదీని ఢీకొనడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు తమ సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. అయితే, ఆ కూటమికి 1977లో వలె జయప్రకాశ్ నారాయణ్ వంటి సమర్థ నాయకత్వం లేకపోవడంతో పుంజుకోలేక పోతోంది. ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి చెందిన రాహుల్ గాంధీ నాయకత్వంపై భాగస్వామ్య పక్షాలకు విశ్వాసం లేకపోవడంతో ఎవరికి వారు తామే ప్రధానమంత్రి అభ్యర్థిగా ఊహల పల్లకిలో ఊరేగారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ తర్వాత తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే ప్రధాన పార్టీలుగా ఉండేవి. ఇది గమనించిన మోదీ ఆ పార్టీలపై దృష్టి కేంద్రీకరించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి కేంద్ర స్థానమైన ఢిల్లీపై నజర్ పెట్టారు. అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీలోనే ఓడించి బీజేపీని అధికార పీఠంపై కూర్చోబెట్టారు. ఎన్నికల్లో ఓటమితో పాటు లిక్కర్ స్కాంలో జైలుకు కూడా వెళ్లిన కేజ్రీవాల్ ప్రస్తుతం ఇండియా కూటమితో అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. రాజకీయంగా ఎదురుదెబ్బలు తగలక ముందు కాంగ్రెస్ పార్టీ కంటే తమదే పెద్ద పార్టీ అని, ఇండియా కూటమికి తానే నాయకత్వం వహిస్తానని, కుదిరితే తానే ప్రధానమంత్రి కావాలని కేజ్రీవాల్ కలల ప్రపంచంలో విహరించారు. కారణం తెలియదుకానీ ప్రస్తుతం ఆయన సైలెంట్‌గా ఉంటున్నారు.

నిన్నటి వరకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్న మమతా బెనర్జీ కూడా ప్రధాని కావాలని ఉవ్విళ్లూరారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉన్నప్పటికీ కూటమికి ఆ పార్టీ నాయకత్వం వహించడాన్ని ఆమె వ్యతిరేకిస్తూ వచ్చారు.

# అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం.. స్వాగతించిన ప్రధాని మోదీ..

మొదటి పేజీ తరువాయి

సమయం ప్రతినిధి : అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనడమే కాకుండా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు. 'గత కొద్ది నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగిన ఘర్షణల వల్ల అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించి, శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుంది. సుస్థిరమైన తుది ఒప్పందం కుదిరేలా.. మిగిలిన అంశాలపై కూడా సానుకూల చర్చలు కొనసాగుతాయని ఆశిస్తున్నాం' అని మోదీ పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేలా శాంతి ఒప్పందం ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు యుద్ధ చర్యలను నిలిపివేసి, ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మార్గాన్ని తిరిగి తెరవడానికి అంగీకరించాయి. దీనివల్ల అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పట్టాయి.

## కేరళలో 'నిఫా' కలకలం.. తమిళనాడు అలర్ట్..

# సరిహద్దుల్లో మెడికల్ క్యాంప్‌లు, ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి

చెన్నై/ఊటీ, సమయం ప్రతినిధి : పొరుగు రాష్ట్రమైన కేరళలో మళ్లీ 'నిఫా' వైరస్ కేసులు వెలుగుచూడటంతో తమిళనాడు ప్రభుత్వం అప్రమత్తమైంది. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది.తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు.

## డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు.. భారీగా మెఫెడ్రోన్ స్వాధీనం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, సమయం ప్రతినిధి : నగర శివారులోని అబ్దుల్లా పూర్‌మెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా గుట్టును ఈగల్ టీం రట్టు చేసింది. సోమవారం డ్రగ్స్ తయారు చేస్తున్న నరేష్, మత్స్యగిరిలను ఈగల్ టీం అరెస్ట్ చేసింది. ఈ ముఠాలో సంతోష్ సింగ్ అలియాస్ రాజు అలియాస్ రాజేష్, విజయ్, అశ్విని పాఠక్ కీలక సభ్యులుగా ఉన్నారని ఈగల్ టీం తెలిపింది. అలాగే రూ.50 లక్షల విలువైన మెఫెడ్రోన్‌తోపాటు రసాయనాలను స్వాధీనం చేసుకుంది. రూ.50 లక్షల విలువైన ఆ ఫ్యాక్టరీని సీజ్ చేసింది. నరేష్, కీసర మత్స్యగిరిలు గత కొన్ని సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్నారని ఈగల్ టీం వెల్లడించింది. రసాయన శాస్త్రవేత్త నుంచి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా సభ్యులుగా వీరు ఎదిగారని తెలిపింది. గతంలో వీరు హత్యలు, దోపిడీలతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని వివరించింది. చివరకు వీరు డ్రగ్స్ తయారీదారులుగా మారారని తెలిపింది. అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్‌లో ఈ ముఠా కీలకంగా వ్యవహరిస్తుందని వెల్లడించింది. గత ఆరు నెలలుగా వీరి కోసం గాలిస్తున్నామని చెప్పింది. 2015 నుంచి దేశవ్యాప్తంగా అక్రమ డ్రగ్స్ తయారీ కేంద్రాలను ఈ ముఠా ఏర్పాటు చేసి.. తన కార్యకలాపాలు కొనసాగిస్తుందని ఈగల్ టీం వివరించింది.

## డీఆర్‌డీఓకు మరో భారీ విజయం.. సుదూర క్రూయిజ్ క్షిపణి పరీక్ష విజయవంతం

మొదటి పేజీ తరువాయి

భారత్ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిసైల్‌ను రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ సోమవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ క్షిపణిని ప్రయోగించారు. ప్రయోగ సమయంలో క్షిపణి నిర్దేశిత మార్గంలో ప్రయాణించి.. అన్ని లక్ష్యాలను విజయవంతంగా పూర్తిచేసినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. వివిధ ట్రాకింగ్, మానిటరింగ్ వ్యవస్థలు సేకరించిన డేటా ద్వారా కీలక సాంకేతిక పరిజ్ఞానాల పనితీరునూ ధ్రువీకరించబడినట్లు తెలిపింది. ఈ విజయంతో భారత్ సుదీర్ఘమైన కచ్చిత దాడి సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకుందని రక్షణ అధికారులు పేర్కొన్నారు. క్షిపణి అభివృద్ధిలో డీఆర్‌డీఓ సహా భారతీయ పరిశ్రమలూ కీలక పాత్ర పోషించాయన్నారు.

### ఏమిటీ LRLACM?

LRLACM క్షిపణి సుమారు 1,500 కిలోమీటర్ల వరకు ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. స్వల్ప ఎత్తులోనే ప్రయాణిస్తూ శత్రు రాడార్లకు చిక్కకుండా సులభంగా లక్ష్యాలను చేరుకోవడం దీని ప్రత్యేకత. అవసరమైతే గగనతలంలోనే కాసేపు సంచరిస్తూ, లక్ష్యాన్ని గుర్తించిన అత్యంత కచ్చితత్వంతో దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం. ఈ క్షిపణిని సంప్రదాయ వార్‌హెడ్‌లు సహా అణు వార్‌హెడ్‌లనూ మోసుకెళ్లగలదని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో భూ ఆధారిత వ్యూహాత్మక దాడి వ్యవస్థల్లో భారత్ మరింత బలోపేతం కానుంది. ఈ ప్రాజెక్ట్‌కు బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ADE) నోడల్ ల్యాబొరేటరీగా వ్యవహరించింది. ఈ ప్రయోగాన్ని భారత నౌకాదళ, వాయుసేన ప్రతినిధులు, డీఆర్‌డీఓ సీనియర్ అధికారులు ప్రత్యక్షంగా వీక్షించారు.

## వీడని జ్ఞానేశ్వరి అదృశ్యం మిస్టరీ.. రంగంలోకి పవన్!

కాకినాడ : కాకినాడ జిల్లా తుని మండలంలో చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. : చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన మిస్టరీ ఇంకా వీడడం లేదు. ఆ చిన్నారి అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తోంది. వందలాది మంది పోలీసులు జల్లెడ పడుతున్నారు. కానీ ఇంతవరకు ఆచూకీ లేదు. ఈ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై ఆరా తీసారు. కాకినాడ ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కనుకునేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. గాలింపు చర్యల్లో పోలీస్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఎన్టీఆర్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. దట్టమైన అడవుల్లో సైతం వెళ్ళగలిగే అటవీ శాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంపు వాచర్స్, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని కూడా ఆదేశాలు జారీ చేశారు పవన్ కళ్యాణ్.కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు పలుమార్లు గాలింపు చర్యలు చేపట్టినా చిన్నారి ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. చిన్నారి కనిపించకుండా పోయినప్పటి నుంచి ఆమె కోసం అన్ని దిశల్లో అన్వేషణ కొనసాగుతోంది. పాప సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, చిన్నారి కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న అధికారులు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన హనుమాన్ టీం రంగంలోకి దిగింది. నిన్న అర్ధరాత్రి నుంచే అటవీ ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించిన బృందాలు అడవిలోని ప్రతి ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. చిన్నారి జాడ కోసం పోలీసులు, అటవీశాఖ సిబ్బంది, ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రెండు థర్మల్ డ్రోన్లను రంగంలోకి దించారు. రాత్రి సమయంలో కూడా స్పష్టమైన సమాచారాన్ని సేకరించేందుకు ఈ డ్రోన్లు సహాయపడుతున్నాయి. డ్రోన్ కెమెరాల ద్వారా అడవిలోని పొదలు, లోయలు, చేరుకోవడం కష్టమైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

## దువ్వాడ దారెటు...

విజయనగరం : రీల్స్ "రాజా" పరిస్థితి దారుణంగా మారిపోయింది. పుట్టింటి వాళ్ళు వదిలేశారు. నమ్ముకున్న పార్టీ తరిమేసింది.. అన్నట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. తాడేపల్లి నుంచి క్లియర్ మెసేజ్ వచ్చింది. రీ ఎంట్రీ లేదని అన్ని మూసుకొని కూర్చోవాలని.. పార్టీ అధిష్టానం చెప్పేసింది. ఇప్పుడు ఏం చేయాలి.. చీరలు అమ్ముకుంటూ.. రీల్స్ చేసుకుంటూ బతకాలి.. ఇది ఆ సిట్టింగ్ ఎమ్మెల్సీ పరిస్థితి.ఉత్తరాంధ్రలో దువ్వాడ శ్రీనివాస్ కు ఒకప్పుడు భారీగానే ఫాలోయింగ్ ఉండేది. ఫ్యాన్ పార్టీలో ఆయన ఎమ్మెల్సీ కూడా. ఆయన జీవితంలోకి మాధురి రావడంతో పరిస్థితి మారిపోయింది. రాజకీయంలో హత్యలు ఉండవు ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయి అనే సామెత అతని ద్వారా మరోసారి నిరూపితమైంది. భార్యను.. ఇద్దరి పిల్లల్ని వదిలిపెట్టి ఆయన తన దారితను చూసుకున్నాడు. వృద్ధాప్యంలో యవ్వనం లాగా.. పడుచు కుర్రాడి లాగా రెచ్చిపోతున్నాడు. మాధురితో రీల్స్ చేయడం.. టీవీ చానల్స్ లలో ముద్దులు పెట్టడం.. ఇలా రకరకాల హంగామా చేస్తున్నాడు.దీనివల్ల 2024 లో పార్టీకి చాలావరకు డ్యామేజ్ జరిగింది. టెక్కలి నియోజకవర్గం లోనే కాకుండా.. ఉత్తరాంధ్ర మొత్తంలో పార్టీకి పెద్ద దెబ్బ పడిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అప్పటికప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏమి చెప్పకపోయినప్పటికీ.. వచ్చి కలువు అన్నారు. అయితే ఇంతవరకు అపాయింట్మెంట్ దొరకలేదు. చివరికి తాడేపల్లి ప్యాలస్ నుంచి క్లియర్ మెసేజ్ వచ్చేసింది. రీ ఎంట్రీ లేదని స్పష్టంగా వర్తమానం అందింది.వైసీపీలోకి మళ్ళీ వెళ్లడానికంటే ముందు శ్రీనివాస్ బిజెపి.. టిడిపి.. జనసేన నాయకులతో మంతనాలు జరిపారు. పార్టీలో చేర్చుకోవాలని వర్తమానం పంపించారు. ఏ పార్టీ నుంచి కూడా సరైన స్థాయిలో స్పందన రాలేదు. మరోవైపు తాడేపల్లి ప్యాలెస్ గేటు కాదు కదా కనీసం ప్రహరీ గోడ కూడా టచ్ చేయడానికి అవకాశం లేదని వర్తమానం అందడంతో శ్రీనివాస్ అంతర్మదనంలో ఉన్నారు. ఆయన సన్నిహితురాలు ప్రస్తుతం హైదరాబాదులో చీరల వ్యాపారం చేస్తున్నారు. ఆయన కూడా అక్కడే ఉంటున్నారు. అప్పుడప్పుడు ఉత్తరాంధ్రకు వెళ్లి పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అన్ని పార్టీలు డోర్లు క్లోజ్ చేయడంతో.. శ్రీనివాస్ ఏం చేస్తారు.. ఇండిపెండెంట్గా రంగంలోకి దిగుతారా.. లేక రీల్స్ చేసుకుంటూ.. సోషల్ మీడియా ఛానల్స్ కు ఇంటర్వ్యూలు ఇచ్చుకుంటూ వెళ్తారా అనేది చూడాల్సి ఉంది..

# ప్రజావాణి పిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి) :** జిల్లాలో ప్రజావాణి ద్వారా అందుతున్న ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ఆయన అర్జిదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న అదనపు కలెక్టర్, ప్రతి దరఖాస్తును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాలోని పలు శాఖల్లో ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, ఎంపీడీఓలు, కలెక్టరేట్ కార్యాలయాల్లో పెండింగ్ దరఖాస్తులు అధికంగా ఉన్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, వాటి వివరాలను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని శాఖల అధికారులు ఇప్పటికీ పోర్టల్‌లో లాగిన్ చేయలేదని గుర్తుచేస్తూ, వెంటనే లాగిన్ అయి దరఖాస్తుల పరిష్కార స్థితిని నవీకరించాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో పంచాయతీరాజ్, మున్సిపల్, జిల్లా పౌరసరఫరాలు, భూ సర్వే రికార్డులు, గృహనిర్మాణం, విద్య, వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, వెనుకబడిన తరగతుల సంక్షేమం, బ్యాంకింగ్, గ్రామీణాభివృద్ధి, పోలీసు, షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాంఘిక సంక్షేమ గురుకుల విద్య, బీసీ గురుకుల విద్య, గిరిజన అభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 119 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

**119 వినతుల స్వీకరణ - అంగన్వాడీల బలోపేతం, నషాముక్త్ భారత్ కార్యక్రమాలపై సమీక్ష**



**అంగన్వాడీల బలోపేతం - అవగాహన కార్యక్రమాలు**

ప్రజావాణి అనంతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల బలోపేతం, నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం మాట్లాడుతూ, చిన్నారుల చేరికలను పెంచే లక్ష్యంతో జూన్ 13 నుంచి 19 వరకు "అమ్మ మాట -- అంగన్వాడి బాట" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

**జూన్ 17 నుంచి నషాముక్త్ భారత్ అభియాన్ :** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలన లక్ష్యంగా "నషాముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కి పహచాన్" కార్యక్రమాన్ని జూన్ 17 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు జరీనా బేగం తెలిపారు. జూన్ 17న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు, ఎక్సైజ్, ఎన్ఎస్ఎస్, వైద్య ఆరోగ్య, విద్య, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా "సే నో టు డ్రగ్స్" అంశంపై విద్యార్థులతో వాదోపవాద పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మల్దకల్ తిమ్మప్ప స్వామి ఆలయంలో ఏళ్ల తరబడి ఒకే చోట సిబ్బంది: బదిలీలు ఎప్పుడంటే..?






**సమయం ప్రతినిధి :** గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి (తిమ్మప్ప స్వామి) దేవాలయంలో సిబ్బంది బదిలీల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ పరిపాలనా అధికారి అయిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)లు నిబంధనల ప్రకారం నిర్ణీత కాలానికి బదిలీ అవుతున్నప్పటికీ, మిగిలిన కార్యాలయ సిబ్బంది మాత్రం ఏళ్ల తరబడి ఒకే స్థానంలో తిష్ట వేయడంపై భక్తులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు ఉన్నా అమలు శూన్యం**

దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనల ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఒకే చోట మూడు నుండి ఐదేళ్లకు మించి పని చేయకూడదు. కానీ, మల్దకల్ ఆలయంలో పని చేస్తున్న పలువురు సిబ్బంది గత ఐదారు ఏళ్లుగా, కొందరైతే అంతకంటే ఎక్కువ కాలంగా ఇక్కడే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కొత్తగా వచ్చే ఈఓలకు స్థానిక లూప్‌హోల్స్ తెలియకపోవడం, పాత సిబ్బందే ఇక్కడ సర్వస్వమై వ్యవహరిస్తుండటంతో ఆలయ పరిపాలనపై భారం పడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

**పారదర్శకత లోపిస్తోందనే ఆరోపణలు**

ఒకే చోట సుదీర్ఘ కాలం సిబ్బంది కొనసాగడం వల్ల ఆలయ ఆదాయ వ్యయాల లెక్కలు, ల్యాండ్ రికార్డులు, జాతర నిధుల నిర్వహణలో పారదర్శకత లోపించే అవకాశం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. కేవలం అధికారులను మాత్రమే మార్చి, కింది స్థాయి సిబ్బందిని అలాగే ఉంచడం వెనుక దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం లేదా రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


**ఉన్నతాధికారులు స్పందించాలి**

ఆలయ పవిత్రతను కాపాడటంతో పాటు, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ వెంటనే స్పందించాలని భక్తులు కోరుతున్నారు. మల్దకల్ ఆలయంలో దీర్ఘకాలంగా పాతుకుపోయిన సిబ్బంది అందరినీ తక్షణమే ఇతర ఆలయాలకు బదిలీ చేసి, వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి

వనపర్తి, సమయం ప్రతినిధి : సోమవారం మండల కేంద్రంలో ప్రజాసంఘాల నాయకులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభల కరపత్రాలను పాన్గల్ మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి దేవేందర్, సిఐటియు జిల్లా నాయకులు జి వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్ నిరంజన్ లు మాట్లాడుతూ,,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలు 2026 జూన్ 20, 21, 22వ తేదీలలో మహబూబ్నగర్ పట్టణంలో జరుగుతా ఉన్నాయి జూన్ 20న భారీ బహిరంగ సభ నిర్వహిస్తా ఉన్నాము ఈ భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ మానిక్ సర్కార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారు, అతిథులుగా అఖిలభారత అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్ ఏ విజయ రాఘవన్, మాజీ ఎంపీ కామ్రేడ్ బి వెంకట్, సహాయ కార్యదర్శి కామ్రేడ్ శివ దర్శన్ ఎంపీ. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుండి సంఘం నాయకత్వం పాల్గొంటారు, కూలి పెంచాలి భూమి పెంచాలి తిండైనా పెట్టండి పనైనా చూపండి అని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి పాదయాత్ర చేసింది, కరువులు అంబలి కేంద్రాలు, పశువులకు పశుగ్రాస కేంద్రాలు, నడిపి ప్రజలకు అండగా నిలిచింది, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి కరువు పింఛన్లు, 150 రోజుల ఉపాధి హామీ పని దినాలు సాధించింది, వలసల నివారణకు ప్రాజెక్టుల సాధనకు ఉద్యమాలు నడిపింది, భూ ఉద్యమాలతో పాటు అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు నడిపిన అనుభవం కలిగిన సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతంగా నిర్వహించబోతున్నారు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకత్వం పాల్గొంటా ఉంది, కాబట్టి ఈ ఉమ్మడి జిల్లా వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని 20 తారీకున జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, 21 ,22 తేదీలలో ప్రతినిధుల సభ నిర్వహించడం జరుగుతా ఉంది వ్యవసాయ కూలీల మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని నూతన కమిటీని ఏర్పాటు చేసుకోవడం కోసం రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి కాబట్టి విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నేతలు కోరారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము, కెవిపిఎస్ జిల్లా నాయకులు, భీమయ్య డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

-మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



## విద్యా వ్యాపార మాఫియా దోపిడికి అడ్డుకట్ట వేయాలి

**ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి.**
**-ఎం.డి.కుతూబ్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి.**



(సమయం ప్రతినిధి అమర్ చింత) : రాజ్యాంగ ప్రాథమిక హక్కులో భాగమైన ఉచిత విద్యను అంగడి సరుకుగా మార్చి కొత్త కొత్త టెక్నాలజీ పేర్లతో పవిత్రమైన విద్య వ్యవస్థను స్వార్థపూరిత కుట్రలతో విద్యను వ్యాపారం చేసిన విద్య మాఫియా దోపిడీలపై ప్రభుత్వం తక్షణమే అడ్డుకట్ట వేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి.కుతూబ్ డిమాండ్ చేశారు. అమరచింత మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)అమరచింత మున్సిపల్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.డి కుతూబ్ మాట్లాడుతూ:- కేజీ నుండి పేజీ వరకు ఉచిత విద్య అనే పాలకుల నినాదం కేవలం మాటలకే పరిమితం అయ్యాయని, విద్య హక్కు చట్టంలోని సూత్రాలు, ఫీజుల నియంత్రణ జీవోలు కేవలం పరిపాలన శాఖల పేపర్లకు మాత్రమే పరిమితం చేశారని మండిపడ్డారు.నాణ్యమైన విద్య పేరుతో ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్డు అదుపు లేకుండా ఫీజులు దండుకుంటున్న విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కుతు వేసవిలోనే ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులకు టార్గెట్లు పెట్టి ఇంటింటా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై, ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా గెలుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై ఎన్ని కేసులు నమోదు చేశారో, ఎన్ని విద్య సంస్థలు సీజ్ చేశారో తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు జలగల్ల ఫీజుల దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. జీవో నెంబర్ ఒకటి ప్రకారం ఏ ఒక్క ప్రైవేటు విద్యా సంస్థ నడవడం లేదని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులు దోపిడీ ఆపకపోతే ప్రత్యక్ష దాడులకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మహమూద్,దయాకర్, అరుణ్,మల్లేష్ యాదవ్, శ్రీకాంత్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నోరు.. అండర్ వేరూ.. ప్రతీ చోట కాపీ

లక్నో : ఉత్తర ప్రదేశ్ ఒకటి. ప్రస్తుతం అక్కడ పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి ఎంపిక పరీక్షలు జరుగుతున్నాయి.. ఉత్తరప్రదేశ్ పెద్ద రాష్ట్రం కాబట్టి సహజంగానే నిరుద్యోగ సమస్య అధికంగా ఉంటుంది. పైగా చాలా రోజుల తర్వాత అక్కడి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో భారీగానే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.. ఇప్పటికే శారీరక దారుఢ్య పరీక్షలు పూర్తయ్యాయి. రాత పరీక్షలు నడుస్తున్నాయి. రాత పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి అక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. పరీక్ష నిర్వహిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. విమర్శలకు దారితీస్తోంది.ఉత్తర్ ప్రదేశ్ లోని జౌన్ పూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో నిర్వహించిన తనిఖీలు దేశవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. అక్కడ డిటెక్టర్ తో ప్రతి అభ్యర్థిని తనిఖీ చేస్తున్నారు. ఒక అభ్యర్థి తన అండర్వేర్లో ఫోన్ పెట్టుకుని వచ్చాడు. అది కాస్త డిటెక్టర్ ద్వారా చేసిన తనిఖీల్లో బయటపడింది. దీంతో అభ్యర్థులను ముందుగా అండర్వేర్లో డిటెక్టర్ పెట్టి పరీక్షిస్తున్నారు. ఆ తర్వాత దానిని నోట్లో కూడా పెడుతున్నారు. అండర్వేర్ నుంచి నోరు వరకు దేనిని వదలకుండా డిటెక్టర్ పెడుతుండడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటికి నోరు మెదపకపోయినప్పటికీ.. ఉద్యోగం కావాలి కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో దానిని తట్టుకుంటున్నారు.

నవ సమయం
మంగళవారం 16 జూన్ 2026

# కొనుగోలు సరే.. మరి అవినీతి సంగతేంటి..?

కాశీ విశ్వనాథ్ వచ్చిన తరువాతే
జిల్లాకు అవినీతి మరకలు
సుద్దపూస మాటలు మాని...మాయమైన
ధాన్యం సంగతి బయట పెట్టాలి
అక్రమ ధాన్యం కేటాయింపులపై
ఊసే ఎత్తని డిఎస్ఓ
అదనపు కలెక్టర్, డీఎం లేకుండానే సమావేశం
పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటి?
అహంకారంతో మాట్లాడినందుకు జిల్లా
ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే
డీఎస్ఓ ఎన్ని వేషాలు వేసినా చంచల్ గూడ
జైలులో ఊచలు లెక్క పెట్టాల్సిందే

## - బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



(సమయం, ప్రతినిధి వనపర్తి) : ప్రభుత్వం తరఫున కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు సరే కానీ జిల్లాలో జరిగిన అవినీతి, అక్రమాల సంగతి ఏంటని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిఎస్ఓ కాశీ విశ్వనాథ్ ని ప్రశ్నించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో సివిల్ సప్లయ్ శాఖలో జరుగుతున్న అవకతవకలపై ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ.... జిల్లాలో ధాన్యం కొనుగోలు, అవకతవకలు, అక్రమాల గురించి బహిర్గతం చేయకుండా డిఎస్ఓ తాను సుద్దపూసనని మీడియా సమావేశంలో మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, ప్రభుత్వం తరఫున రైతులకు చెల్లించిన డబ్బుల గురించి చెప్పడం సరే, కానీ ఈ వివరాలు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ వివరించి ఉంటే జిల్లా ప్రజలు నమ్మే పరిస్థితి ఉండేదని అన్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టరును కాదని డీఎస్ఓ ధాన్యం కొనుగోలు వివరాలు వెల్లడించడం దేనికి సంకేతం అని, జిల్లాలో కలెక్టర్ ఉన్నారా? లేక డీఎస్ఓనే కలెక్టరుగా వ్యవహరిస్తున్నారా? అని నిలదీశారు. మిల్లులకు అనుమతులు ఇవ్వడం, మిల్ కోడ్ ఇవ్వడం, బిజీ ప్రకారం ధాన్యం కేటాయించడం, ట్యాగింగ్ చేయడం వంటి విధులు డిఎస్ఓ పరిధిలో ఉంటాయని, గన్ని బ్యాగుల పంపిణీ, ట్రాన్స్పోర్ట్ ప్రక్రియ, పేమెంట్ చేయడం వంటి పనులు డిఎం చేయాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా సర్వం తానే అనే విధంగా అదనపు కలెక్టర్, డిఎం లేకుండా మీడియా సమావేశం ఎలా నిర్వహించారని నిలదీశారు.వరస్ట్ వనపర్తిని తాను వచ్చిన తర్వాతే సర్వాంగ సుందరంగా చేసినట్లు చిలుక పలుకులు పలికిన డిఎస్ఓ పాత బకాయిలు ఎంత వసూలు చేశారో? చెప్పాలని అన్నారు. దాదాపు రూ. 763 కోట్ల పాత బకాయిలలో కనీసం ఒక రూ. లక్ష అయినా రికవరీ చేశారా? చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 2024-25 రభి సీజన్లో రికవరీ ఎవరు చేశారని, 15% రికవరీ అయిన తర్వాత విధులకు సెలవు పెట్టి వెళ్ళింది మీరు కాదా అని ప్రశ్నించారు. అప్పుడున్న అదనపు కలెక్టర్ డిఎం చొరవతో 90% వరకు రికవరీ చేశారని గుర్తు చేశారు. 2023-24 ఏడాదిలో కమిషనర్ నుంచి సిఎంఆర్ అలాట్మెంట్ వస్తే కూడా త్వరగా ఇవ్వలేదని, డీఎస్ఓకు బేరం కుదరకపోతే ఎంతకైనా తెగిస్తాడని విమర్శించారు. సమయం దాటిపోతున్న సమయంలో అనుమతులు ఇచ్చి పలువురు రైస్ మిల్లర్లను డి ఫాల్టర్లుగా చేసిన ఘనత కూడా డిఎస్ఓ కాశీ విశ్వనాథ్ దేనన్నారు. నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలు మాట్లాడుతున్న డిఎస్ఓ రూ.5 లక్షల బిజీ ఇచ్చిన మిల్లుకు రూ.7 కోట్ల ధాన్యం ఎలా కేటాయించారని, రూ.10 లక్షల బిజీ ఇచ్చిన మిల్లుకు రూ. 6.5 కోట్ల ధాన్యం ఎలా కేటాయించారో చెప్పాలన్నారు. అదేవిధంగా రూ. 18 కోట్ల ధాన్యం మాయమై.. కస్టోడియనుగా ఉన్నటువంటి అదే మిల్లులో మళ్ళీ రూ. 9 కోట్ల ధాన్యం ఎలా మాయం అయ్యిందో వివరించాలని సూటిగా ప్రశ్నించారు. అదేవిధంగా పెబ్బేరులో ఉన్న సాయి గణేష్ రైస్ మిల్, సాయి గణేష్ ఇండస్ట్రీస్ రెండు మిల్లులు కలిపి దాదాపు రూ. 43 కోట్లు ప్రభుత్వానికి బకాయి ఉందని, ఇట్టి రెండు మిల్లులను మూడు సంవత్సరాల పాటు (ఆరు సీజన్లు) జిల్లా కలెక్టర్ బ్లాక్ లిస్టులో పెట్టడం, తిరిగి మళ్లీ కస్టోడియనుగా నెల రోజులకే ధాన్యం కేటాయిస్తూ అనుమతులు ఇవ్వడం అవినీతి కాదా అని ప్రశ్నించారు. ఈ అవినీతి వెనుక జిల్లా కలెక్టర్, డిఎస్ఓ కాశీ విశ్వనాథ్ ఇద్దరిలో ఎవరి ప్రమేయం ఉందో జిల్లా ప్రజలకు వివరించాలన్నారు. నేడు తిరిగి అదే మిల్లుకు వందలకోట్ల ధాన్యాన్ని కేటాయించడం అవినీతి కాదా? అని అన్నారు. ఇన్ని రోజులు డిఎస్ఓ అవినీతి అక్రమాలపై ప్రశ్నించిన తమ దగ్గర పూర్తి సాక్షాదారాలు ఉన్నాయని, కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, మీడియా సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వస్తావా అని సవాల్ విసిరారు. గత రబీ సీజన్లో మిగిలిన 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని మిల్లులకు కేటాయించాలని కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ మీరు కేటాయించకపోవడం వల్లే నేడు మిల్లుల కొరత ఏర్పడింది అన్నది నిజం కాదా అని అన్నారు. ఇప్పటికైనా కమలహాసన్ యాక్షన్లు మాని చేసిన తప్పును ఒప్పుకోవాలని, అవినీతి డీఎస్ఓ కాశీ విశ్వనాథ్ ను చంచల్ గూడ జైలుకు పంపించి ఊచలు లెక్క పెట్టించే వరకు బీసీ పొలిటికల్ జేఏసీ నిద్రపోదని అన్నారు.

### జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే

డిఎస్ఓ కాశీ విశ్వనాథ్ ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వనపర్తి జిల్లాను, జిల్లా ప్రజలను కించపరిచే విధంగా వరస్ట్ వనపర్తి అని సంబోధించడాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. కాశీ విశ్వనాథ్ ప్రభుత్వ ఉద్యోగి కాక ముందు నుంచే వనపర్తి అభివృద్ధిలో ముందు వరుసలో ఉందని, ఇక్కడి ప్రజలు విజ్ఞతగలవారని, మేధావులుకవులు, కళాకారులతో కూడిన విద్యాపర్తిగా రాష్ట్రంలోనే ఒక గుర్తింపు పొందిన పట్టణంగా ఉందని గుర్తు చేశారు. అలాంటి ఘనకీర్తి కలిగిన జిల్లాను వరస్ట్ వనపర్తి అని సంబోధించిన డీఎస్ఓ కాశీ విశ్వనాథ్ తన అహంకార బుద్ధిని ప్రదర్శించాడని మండిపడ్డారు. తక్షణమే తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని జిల్లా ప్రజలకు మీడియా ముఖంగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, పట్టణ అధ్యక్షుడు దేవర శివ, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కృష్ణ ప్రసాద్, రామన్ గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# గద్వాలలో భారీ దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు: ఇద్దరు నిందితుల అరెస్ట్




(సమయం ప్రతినిధి గద్వాల) : గద్వాల పట్టణంలో ఇటీవల జరిగిన ఒక భారీ దొంగతనం కేసును స్థానిక పోలీసులు అత్యంత ప్రతిభావంతంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని ఒక తాళం వేసిన ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ. 7,000 నగదుతో పాటు 60 తులాల వెండి, 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

**జోరుగా తిరుగుతూ రెక్కీ.. ఆపై దొంగతనం**

పోలీసుల వివరాల ప్రకారం నిందితుల్లో ఒకరైన మహబూబ్ వెల్డింగ్ పని చేస్తుండగా, మరొకరు మేస్త్రీగా పని చేసేవారు. వీరిద్దరికీ వచ్చే సంపాదన సరిపోకపోవడంతో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు తెరలేపారు. ఈ క్రమంలో గద్వాల పట్టణంలోని భీమ్ నగర్ పరిసరాల్లో బైక్‌పై తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించారు. పథకం ప్రకారం జూన్ 10, 2026 ఉదయం సమయంలో ఒక తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును దొంగిలించారు. ఆ వస్తువులను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూస్తుండగా పోలీసులకు చిక్కారు.

**నిందితుడి వివరాలు:**

A1: మహబూబు (వయస్సు 19 సంవత్సరాలు), వృత్తి: వెల్డింగ్ పని, నివాసం: చెనుగోనిపల్లి గ్రామం, గద్వాల మండలం.

**స్వాధీనం చేసుకున్న సొత్తు:**

9 తులాల బంగారం (పొడవైన గొలుసు, మంగళసూత్రం, జంట జుంకాలు, చెవి రింగులు, సైడ్ ఇయర్ రింగ్స్, చిన్న పిల్లల ఉంగరం, పెద్ద ఉంగరం, ముక్కు పుల్ల).60 తులాల వెండి.రూ. 7,000 నగదు.దొంగతనానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ (బైక్).

**పోలీసుల చాకచక్యం - ఎస్పీ అభినందనలు:** జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీ కె. శ్రీనివాస రావు, ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ మరియు గద్వాల డీఎస్పీ గారి పర్యవేక్షణలో గద్వాల సిఐ శ్రీ శ్రీను, కళ్యాణ్ ఎస్సై ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సిసి కెమెరాల దృశ్యాలు, సాంకేతిక నైపుణ్యం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు జూన్ 15, 2026 (ఈరోజు) ఉదయం గద్వాల పట్టణ శివారులోని చెనుగోనిపల్లి వెళ్లే రహదారి వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం ఉదంతం వెలుగుచూసింది.కేసును కేవలం 5 రోజుల్లోనే కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన గద్వాల సిఐ శ్రీను, కళ్యాణ్ ఎస్సై, మరియు పోలీస్ సిబ్బంది (ఇంద్రయ్య, కిరణ్, రామకృష్ణ) లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# 10 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు R N రమేష్**



(సమయం ప్రతినిధి వనపర్తి) : వనపర్తి జిల్లా సోషల్ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్ వర్కర్స్ 10 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం రోజు కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ ఖీమా నాయక్ కి సిఐటియు హాస్టల్ వర్కర్స్ యూనియన్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు = చీ రమేష్ మాట్లాడుతూ హాస్టల్ వర్కర్లు వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు, చెందిన వారే అత్యధికులుగా ఉన్నారు, వీరికి ఇలాంటి చట్టబద్ధత సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, కనీసం గ్యారంటీ సూరిటి లేని వేతనం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయం చేయలేదు, 10 నెలల నుంచి వేతనాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు అని, ఇప్పుడు విద్యాసంస్థల ప్రారంభం కావడం జరిగింది. పిల్లల చదువులకు ఇబ్బందులుగా ఉన్నాయని, వానకాల సీజన్ ప్రారంభమవుతా ఉంది పనుల పెట్టుబడులకు, కుటుంబం అవసరాల రిత్య కూడా గడవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అమలు చేయడంలో మర్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు ఏమోగానీ చేసిన పనికి సంబంధించిన జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో కార్మికులను సంఘటితం చేసి అధికారులపై, ప్రభుత్వంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రజినీకాంత్, అలివేలమ్మ, రంగమ్మ, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య - అన్నదానం



అమరచింత : శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నూతన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించబడినది ఇట్టి కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్ కోశాధికారి మహేందర్ దామోదర్ దేవర్ల సురేష్ కురుమన్న వెంకటేష్ శివ అభి భక్తులు పాల్గొన్నారు.

# పెన్షన్ బకాయిలు, వడ్డీ చెల్లింపులపై హైకోర్టు కీలక ఆదేశాలు

**తీర్పును స్వాగతించిన న్యాయవాది వై. రవి ప్రకాష్ యాదవ్**



హైదరాబాద్ : రాష్ట్రంలోని పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ పెన్షన్ బకాయిల చెల్లింపుల అంశంపై తెలంగాణ హైకోర్టులో సోమవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గౌరవ న్యాయమూర్తి శ్రీ పుల్లా కార్తీక్ ధర్మాసనంలో పెండింగ్‌లో ఉన్న కోర్టు ధిక్కరణ కేసులపై విచారణ జరిగింది. విచారణ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ తరఫున పెండింగ్‌లో ఉన్న పెన్షన్ బకాయిలకు సంబంధించిన నిధులు జమ చేసినట్లు కోర్టుకు తెలియజేశారు. అయితే ప్రభుత్వ వాదనలో పేర్కొన్న వివరాలు పూర్తిగా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేవని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మధ్యాహ్నం సుమారు 1:30 గంటల వరకు కొంతమంది పెన్షనర్ల ఖాతాల్లో మాత్రమే బకాయిలు జమ అయినట్లు కోర్టుకు వివరించారు. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పెన్షన్ బకాయిలు ఆలస్యంగా చెల్లించినందున సంబంధిత మొత్తాలపై 10 శాతం వడ్డీతో చెల్లించాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఇప్పటివరకు ఏ ఒక్క పెన్షనర్‌కూ వడ్డీ చెల్లించలేదని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై గౌరవ న్యాయమూర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ కోర్టు ఆదేశాలను పూర్తిగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పెన్షన్ బకాయిలతో పాటు వడ్డీ మొత్తాలను కూడా చెల్లించాలని, కొంతమందికి మాత్రమే కాకుండా అర్హులైన పదవీ విరమణ పొందిన వారందరికీ చెల్లింపులు పూర్తి చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ తీర్పుపై ప్రముఖ హైకోర్టు న్యాయవాది వై. రవి ప్రకాష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. పెన్షనర్ల హక్కులను పరిరక్షించే దిశగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు కీలకమని పేర్కొన్నారు. ఆలస్యమైన చెల్లింపులపై వడ్డీ చెల్లించాలని కోర్టు మరోసారి స్పష్టత ఇవ్వడం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుతుందని అన్నారు. ప్రభుత్వం కోర్టు ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేసి అర్హులైన ప్రతి పెన్షనర్‌కు రావలసిన మొత్తాలను త్వరితగతిన చెల్లించాలని ఆయన కోరారు.

# పోలీసుల పక్షపాత వైఖరికి నిరసనగా విధులను బహిష్కరించిన మహబూబ్‌నగర్ న్యాయవాదులు

మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి) : మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యుడైన న్యాయవాది వి. నరేందర్ నాయక్‌పై అక్రమంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారంటూ నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం జిల్లా న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఆనంద్‌రావు నాయకత్వంలో న్యాయవాదులు భారీ ర్యాలీగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రాన్ని సమర్పించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, తమ అసోసియేషన్ సభ్యుడైన వి. నరేందర్ నాయక్‌పై రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అక్రమంగా కౌంటర్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తూ న్యాయవాదులందరూ విధులను బహిష్కరించి నిరసన చేపట్టినట్లు తెలిపారు. నిందితుడైన బద్రు నాయక్ భార్య ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా, సంబంధిత ఇన్‌స్పెక్టర్ నిందితులతో కుమ్మక్కై బాధితుడైన న్యాయవాదిని భయభ్రాంతులకు గురిచేసే ఉద్దేశంతో క్రైమ్ నంబర్ 330/2026 కింద అక్రమ కౌంటర్ ఎఫ్ఐఆర్




నమోదు చేశారని బార్ అసోసియేషన్ ఆరోపించింది. న్యాయవాదిపై నమోదు చేసిన తప్పుడు కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని, ఘటనపై జిల్లా ఎస్పీ స్వయంగా నిష్పక్షపాత విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవాదులపై అన్యాయంగా కేసులు నమోదు చేయడం సరికాదని పేర్కొంటూ న్యాయం జరిగే వరకు తమ పోరాటం

## ఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ - నిష్పక్షపాత విచారణకు డిమాండ్

కొనసాగుతుందని హెచ్చరించారు. “అడ్వకేట్లపై జులుం నశించాలి”, “వీ వాంట్ జస్టిస్” అంటూ నినాదాలతో సాగిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, కార్యవర్గ సభ్యులు తమ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఆనంద్‌రావు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి డబ్బుల నర్సింహారెడ్డి, సీనియర్ న్యాయవాదులు చంద్రమౌళి, అనిల్‌కుమార్, గడ్డం గోపాల్, నాగేందర్, మనోహర్, నరేందర్ గౌడ్, రాజీవ్‌కుమార్, కమిటీ సభ్యులు, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలి: జిల్లా ఎస్పీ

**- సమస్యలు విన్న వెంటనే ఫోన్ ద్వారా అధికారులకు ఆదేశాలు జారి**

**- సోమవారం ప్రజావాణిలో 25 ఫిర్యాదుల స్వీకరణ**



వనపర్తి : ప్రతి సోమవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో ఈ రోజు వివిధ ప్రాంతాల నుండి 25 మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి,కి ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశాలు జారీ చేశారు. దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే బరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఈ రోజు ప్రజావాణిలో మొత్తం 25 ఫిర్యాదుల్లో
17,భూతగాదాల ఫిర్యాదులు
08, పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వున్నాయి.

## ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుకు న్యాయం జరగాలి: జిల్లా ఎస్పీ డి.జానకి

### ప్రజల సమస్యలపై తక్షణ స్పందనకు ఆదేశాలు

మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి) : మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా విన్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ, ప్రజలకు సత్వర న్యాయం అందించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖను ఆశ్రయించినప్పుడు వారి వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి పారదర్శకంగా విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఫిర్యాదుదారునికి న్యాయం జరిగేలా అధికారులు



బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించిన ఎస్పీ, ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి బాధితులకు న్యాయం చేకూరే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలందించడం ప్రతి పోలీసు అధికారికి బాధ్యత అని పేర్కొన్న ఆమె, జిల్లా ప్రజలు తమ సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు. అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

## పెరిగిన వేతనాలు -ముగిసిన ప్యాకర్ల సమ్మె



(సమయం ప్రతినిధి దేవరకద్ర): బీడీ ప్యాకింగ్ వేదనాల ఒప్పందం 1000 బీడీ మీద రెండు రూపాయల పెరుగుదల పాత వేతనమో ఎనిమిది 50 పైసల్ రెండు రూపాయలు పెరుగుదల పది రూపాయల 50 పైసల్ జూన్ నెల నుండి బీడీ ప్యాకింగ్ వర్కర్లకు వేతనాలు పెరిగినాయి ఇది జూన్ నెల నుండి అమల్లోకి వస్తుంది ఈరోజు బీడీ యజమానులు వసీం సెట్,జియా సెట్, సుధాకర్ రెడ్డి ఈరోజు TUCI నాయకత్వంలో సమ్మె నిర్వహించి చర్చలు జరిగాయి ఈరోజు 5వ రోజున సమ్మె విజయవంతంగా జరిగిన అనంతరం బీడీ యజమానులతో TUCI రాష్ట్ర కార్యదర్శి కే సూర్యం మహబూబ్నగర్ జిల్లా TUCI జిల్లా అధ్యక్షులు జై ఎన్ దేవదానం వనపర్తి జిల్లా కార్యదర్శి పి అరుణ్ కుమార్ బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కోళ్లవెంకటన్న ఏ కొండన్న, సి రాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు మహిమోద్ మరియు వర్కర్స్ సుందర్ కురుమూర్తి, శేఖర్,కృష్ణయ్య, బీసు,బాలన్న, బాలన్న, సెందిరి,బుడ్డు, తదితరులు పాల్గొని ఒప్పందమును అంగీకరించి సమ్మె విరమించడం జరిగింది.

## తొమ్మిది రోజులైనా దొరకని చిన్నారి జాను ఆచూకీ

కాకినాడ : చిన్నారి జాను జాడ తొమ్మిది రోజులైనా దొరకలేదు. మరోవైపు, జానుతో పాటు వెళ్లి తిరిగొచ్చి చనిపోయిన కుక్కకు పోస్ట్ మార్టం పూర్తి చేసారు. కుక్క శరీరంలో నుండి నమూనాలు సేకరించి విశాఖపట్నంలోని ఫోరెన్సిక్ ల్యాబ్కు పంపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మరో 30 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. చుట్టుపక్కల 7 టవర్ల పరిధిలో 4800 ఫోన్ కాల్స్ విశ్లేషించి, కొందరు అనుమానితులను గుర్తించారు. కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం సమీపంలో 9 రోజుల క్రితం అడవిలోకి వెళ్లి తప్పిపోయింది.

## విద్యుత్ తీగలు తాకి హై స్కూల్ విద్యార్థి గాయాలు : ఏబీవీపీ ధర్నా

దేవరకొండ, కొండమల్లేపల్లి, (సమయం ప్రతినిధి) : అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ కొండమల్లేపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో ఈరోజు కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో (13) సంవత్సరాల రామ్ చరణ్ విద్యార్థితో ఉపాధ్యాయులు పాఠశాలకు తోరణాలను కట్టిస్తున్న తరుణంలో విద్యార్థికి విద్యుత్ తీగలు తాకి పాఠశాల గేటు మీద నుండి కిందపడి హాస్పిటల్ బారిన పడిన ఉపాధ్యాయులపై పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎబివిపి ఖండిస్తూ. ఈ సంఘటనపై ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతన విద్యా సంవత్సరం సందర్భంగా రాష్ట్రమంతా ప్రభుత్వం మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రారంభం చేస్తున్న తరుణంలో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్నటువంటి అటెండర్లు చేసేటటువంటి పనిని ఉపాధ్యాయులు చిన్నపిల్లలతో చేయిస్తూ పనులు చేపిస్తూ దారుణం చోటుచేసుకుంది నాంపల్లి మండలం బండ తిమ్మాపురం గ్రామానికి చెందిన విద్యార్థి కొండ మల్లెపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్ లో చదువుతున్నాడు స్కూల్ పక్కన ఇల్లు ఉండటంతో ఆడుకోవడానికి స్కూల్ వెళ్లిన రామ్ చరణ్(13) 8వ తరగతి ఈ రోజు స్కూల్ ఓపెనింగ్ కావడంతో ఆడుకుంటున్న రామ్ చరణ్ ని పిలిచి గేట్ కి తోరణాలు కట్టమనీ స్కూల్ ఉపాధ్యాయులు చెప్పడంతో బాలుడు రామ్ చరణ్ తోరణం కట్టడానికి వెళ్ళి విద్యుత్ఘాతానికి గురైన బాలుడు గేటు మీద నుండి కిందపడి తలకు గాయమైన సంఘటనతో దేవరకొండలోని ప్రయివేట్ హాస్పిటల్ కి తరలించి చికిత్స




అందిస్తు హైదరాబాద్ హాస్పిటల్ కి బాలుడిని తరలించడం జరిగింది ఈ ఘటనకు కారణమైన ఉపాధ్యాయుడు పై అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపాల్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని విద్య అధికారులకు తెలియజేస్తూ అదే విధంగా విద్యుత్ షాక్కు కు గురైన బాలుడు రామ్ చరణ్ కు మెరుగైన వైద్యం అందిస్తూ వారి కుటుంబానికి ఆదుకోవాలని ఏబీవీపీ కొండమల్లేపల్లి శాఖ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి నగర కార్యదర్శి పర్వతం దినేష్, పగిళ్ల విక్రమ్, వినయ్, చరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ సంగీత కలుసుకున్నారు...

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్.. తన భార్య సంగీతతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. విజయ్ త్రిషతో సన్నిహిత సంబంధం కొనసాగిస్తున్నారని తమిళనాడు మీడియాలో కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. వాటికి బలం చేకూర్చే విధంగా త్రిష, విజయ్ అనేక సందర్భాలలో కనిపించారు. లియో, గోట్ సినిమాలో వారిద్దరు కలిసి నటించారు. అంతకుముందు త్రిషతో విజయ్ కలిసి నటించిన గిల్లి సినిమా సరికొత్త చరిత్ర సృష్టించింది.విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి త్రిష వచ్చింది. త్రిషను ఆయన తల్లి సాదరంగా ఆహ్వానించింది.. విజయ్ తండ్రి కూడా ఆమెను ప్రేమతో దగ్గరికి తీసుకున్నాడు. విజయ్ ఎన్నికల ఫలితాలలో ఎక్కువ సీట్లు సాధించిన తర్వాత.. తిరుపతి వెళ్ళిన త్రిష.. నేరుగా ఆయన ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలియజేసింది. ఆ సమయంలో గంటపాటు త్రిష విజయ్ తో కలిసి ఉంది. ఇటీవల అజిత్ మాతృమూర్తి చనిపోయినప్పుడు త్రిష విజయ్ తో కలిసి వచ్చింది. అంతకుముందు ఓ వేడుకకు విజయ్ తోనే కలిసి కనిపించింది త్రిష.సంగీత ఎన్నికలకు ముందే విజయ్ తో తనకు విడాకులు కావాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ వాయిదాలో ఉంది. త్వరలో వారిద్దరి విడాకులకు సంబంధించి కోర్టు కీలకని తీర్పును వెల్లడించే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగానే విజయ్, సంగీత మళ్లీ కలిసిపోతున్నారని వార్తలు వస్తున్నాయి. కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడంతో వారిద్దరు కలిసి జంటగా జీవించడానికి అంగీకారం తెలిపినట్టు తెలుస్తోంది.ముఖ్యంగా విజయ్ తల్లి శోభ ఇద్దరి మధ్య దూరాన్ని తగ్గించడానికి ప్రయత్నించినట్టు సమాచారం. అయితే ఇంతవరకు అధికారికంగా ఈ విషయంపై ప్రకటన రాలేదు. ఒకవేళ విజయ్, సంగీత కలిసిపోతే త్రిష పరిస్థితి ఏంటి అనే చర్చ కూడా నడుస్తోంది. వచ్చే రోజుల్లో వీరిద్దరి వ్యవహారం ఎటు దారితీస్తుందో చూడాలి.విజయ్ సీఎం అయిన తర్వాత భార్య సంగీత శుభాకాంక్షలు తెలియజేయలేదు. కుమారుడు జేసన్, కుమార్తె కూడా సోషల్ మీడియాలో కనీసం విషస్ కూడా చెప్పలేదు.

# రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుంది

## -జూన్, 28న 0-5 సంవత్సరాల ప్రతి శిశువుకు రెండు చుక్కల పోలియో మందు వేయించి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, సమయం ప్రతినిధి :** భారత దేశంలో ప్రస్తుతం పోలియో మహమ్మారి లేనప్పటికీ ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ వంటి దేశాల్లో ఇప్పటికీ పోలియో మహమ్మారి ఉన్నందున భారత దేశంలో పోలియో రాకుండా ఉండేందుకు 0–5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్న పిల్లలకు జూన్ 28న పోలియో చుక్కలు వేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఇందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, విద్యా శాఖలు సమన్వయంతో పనిచేసి వనపర్తి జిల్లాలో 0–5 సంవత్సరాల ప్రతి ఒక చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 28న ఆదివారం ఉన్నప్పటికి ఏ ఒక్క పిల్లాడు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఇప్పటికే పిల్లలకు పోలియో చుక్కలు వేయించి ఉన్నప్పటికీ ఆదివారం వేసే పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని కలెక్టర్ వివరించారు.సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం పై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. మండల విద్యా అధికారులు, అంగన్వాడీ




సూపర్వైజర్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసి వనపర్తి జిల్లాలో ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేసి వందశాతం విజయవంతం చేసేవిధంగా విధి విధానాలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి తల్లితండ్రులు తమ పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించి పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని సూచించారు.

**జులై, 13న నులిపురుగుల నివారణ దినోత్సవం**

పల్స్ పోలియోతోపాటు జూలై 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. చిన్నపిల్లలు వచ్చే అనీమియా, జీర్ణ వ్యవస్థ సమస్యలు, పిల్లలు శారీరకంగా ఎదగకపోవడం వంటి సమస్యల నుండి విముక్తి కల్పించడానికి నులిపురుగుల నివారణ దినోత్సవం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1–19 సంవత్సరాల బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రను తినిపించడం జరుగుతుందన్నారు. ఒక సంవత్సరం వయస్సు నుండి కళాశాలలో చదివే పిల్లల వరకు వయస్సు, మోతాదు ను బట్టి మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలు తినిపించి వనపర్తి జిల్లాను అనీమియా రహిత జిల్లాగా మార్చాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సాయినాథ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పిల్లలకు అవసరమైనన్ని పోలియో వయోలిన్ లు , ఆల్బెండజోల్ మాత్రలు ఉన్నాయని, జూన్, 28న ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేసే విధంగా పకడ్బందీగా ప్రణాళికలు చేసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా జులై 13న జాతీయ నులిపురుగుల నివారణ రోజున 1–19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, డి. ఆర్ ఓ సూర్యప్రకాష్ , జడ్పీ సి ఈ ఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుని నిర్లక్ష్యంతో విద్యార్థికి విద్యుత్ షాక్



**-ఉపాధ్యాయుని సస్పెండ్ చేయాలి**
**-బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**

దేవరకొండ కొండమల్లేపల్లి, (సమయం ప్రతినిధి) : కొండమల్లెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీధర్ నిర్లక్ష్యం వల్ల విద్యార్థి నాంపల్లి మండలం బండ తిమ్మాపురం గ్రామానికి చెందిన రామ్ చరణ్ కు విద్యుత్ షాక్ కి గురి కావడం జరిగింది అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు.సోమవారం దేవరకొండ పట్టణంలోని సంజీవ ఆసుపత్రిలో విద్యుత్ షాక్ తో చికిత్స పొందుతున్న రామ్ చరణ్ బిఆర్ఎస్వీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ఉపాధ్యాయుని సస్పెండ్ చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. రామ్ చరణ్ కి మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుని, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థికి విద్యుత్ షాక్ రావడం జరిగింది అని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో పని చేయించ వద్దు అని ఆయన అన్నారు. ప్రభుత్వం నిబంధనలు పాటించక పోవడం వల్ల ఎలాంటి సంఘటనలు జరుగుతున్నాయి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్వీ నాయకులు జమీర్ బాబా,అనిల్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ గూటికి జగన్ ! చక్రం తిప్పుతున్న రేవంత్

హైదరాబాద్ : రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఇప్పుడు ఒకదానికొకటి పెనవేసుకుని, అత్యంత ఆసక్తికరమైన చెస్ గేమ్‌ను తలపిస్తున్నాయి. ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్రంలోని ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మెల్లగా గళం విప్పుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. జగన్ ప్రధాని మోదీ లేదా కేంద్ర ప్రభుత్వంపై నేరుగా వ్యక్తిగత విమర్శలు చేయకుండా, కేవలం విధానపరమైన వ్యతిరేకతను మాత్రమే ప్రదర్శిస్తూ ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. ఇదే సమయంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి దక్కాల్సిన రాజ్యసభ సీటు చివరి క్షణంలో సాంకేతిక, రాజకీయ కారణాల వల్ల చేజారడం గమనార్హం. ఈ పరిణామాలు ఏపీలోనే కాకుండా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పొలిటికల్ వ్యూహాల్లోనూ పెను మార్పులకు కారణమవుతున్నాయి.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే కూటమికి దూరంగా జరుగుతూ, లోపాయకారీగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారనే సంకేతాలు పంపడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ఏపీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ కూటమిని ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, జాతీయ స్థాయిలో యాంటీ–బీజేపీ శక్తులతో జతకట్టడం మేలనే యోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని పసిగట్టిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. శుక్రవారం నాటి మీడియా చిట్‌చాట్‌లో జగన్‌కు అనుకూలంగా సానుభూతి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఏపీలో జగన్ సభలకు, ర్యాలీలకు కూటమి ప్రభుత్వం అనుమతులు నిరాకరిస్తోందంటూ రేవంత్ మాట్లాడటం వెనుక.. భవిష్యత్తులో జగన్ కాంగ్రెస్‌కు దగ్గరైతే తద్వారా వచ్చే పొలిటికల్ మైలేజీని ఒడిసిపట్టాలనే ముందస్తు ప్లాన్ కనిపిస్తోంది.ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుతో నొచ్చుకున్న ఒక వర్గాన్ని శాంతపరిచేందుకే, జగన్ సభల అనుమతులపై రేవంత్ సానుభూతి అస్త్రం విసిరారనే ప్రచారం సాగుతోంది. హైదరాబాద్ గుండెకాయ లాంటి అమీర్‌పేట్ జంక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దివంగత నేత ఎన్టీ రామారావు 23 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపింది. కాంగ్రెస్‌కు బద్ధశత్రువుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే పెట్టడంపై తెలంగాణ సెంటిమెంట్ ఉన్న ఒక వర్గం తీవ్ర అసంతృప్తికి లోనైంది. ఈ చర్యతో బీఆర్ఎస్, మలిదశ ఉద్యమకారుల నుంచి రేవంత్ విమర్శలు ఎదుర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని వైఎస్సార్ అభిమానులను, రెడ్డి సామాజికవర్గాన్ని సమతూకం చేయడానికి జగన్ ప్రస్తావన తెచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్టీఆర్ విగ్రహం ద్వారా ఆంధ్రా సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను కొల్లగొట్టడం.. అలాగే జగన్ సభలపై సానుభూతి చూపడం ద్వారా వైఎస్సార్ ఓటు బ్యాంకును కాపాడుకోవడం రేవంత్ మార్క్ డబుల్ గేమ్ . ఈ మొత్తం పరిణామాల వెనుక ఉన్న అసలు లక్ష్యం.. త్వరలో రాబోయే హైదరాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికలే. హైదరాబాద్ పరిధిలో ఆంధ్రా మూలాలున్న ఓటర్లు, సెటిలర్లు గెలుపోటములను శాసిస్తారు. గతంలో ఈ ఓటు బ్యాంక్ అంతా బీఆర్ఎస్ వైపు నిలిచింది. ఇప్పుడు కేసీఆర్ బలహీనపడటంతో ఆ ఓట్లను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడమే రేవంత్ రెడ్డి ఏకైక అజెండా. అందుకోసమే అటు ఎన్టీఆర్ అభిమానులను, ఇటు వైఎస్సార్ అనుచరులను ఒకేలా ప్రసన్నం చేసుకునే దిద్దుబాటు చర్యలకు ఆయన శ్రీకారం చుట్టారని అంటున్నఏపీలో షర్మిల రాజ్యసభ సీటు మిస్ అవ్వడం కూడా జగన్–కాంగ్రెస్ సాన్నిహిత్యానికి మార్గం సుగమం చేస్తోందనే వాదన ఉంది. ఒకవేళ షర్మిలను కాంగ్రెస్ అధిష్ఠానం పార్లమెంట్‌కు పంపి ఉంటే, జగన్ కాంగ్రెస్ వైపు చూడటం అసాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు మారిన సమీకరణాల్లో జగన్ కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, కాంగ్రెస్‌తో ఫ్రెండ్‌షిప్‌కు సై అంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. మొత్తానికి ఏపీలో జగన్ వేస్తున్న అడుగులు.. తెలంగాణలో రేవంత్ రెడ్డి రాస్తున్న పొలిటికల్ స్క్రిప్ట్‌లు రెండూ ఒకదానికొకటి ముడిపడి సాగుతున్నాయి. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో రేవంత్ రెడ్డి నడుపుతున్న ఈ మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను ఏ తీరానికి చేరుస్తుందో చూడాలి.

# దూకుడు ప్రదర్శించని బీఆరెస్

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక విలక్షణమైన, అత్యంత సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం గులాబీ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. పార్టీ పయనంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్గత సమావేశాల్లో వచ్చే ఎన్నికల్లో మనది ఒంటరి పోరే.. ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు అని గట్టిగా చెప్తున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం ఆ మాటలపై ఇంకా నమ్మకం కలగడం లేదు. దీనికి ప్రధాన కారణం.. కేంద్రంలోని బీజేపీపై, మోదీ ప్రభుత్వంపై కేటీఆర్ గానీ, కేసీఆర్ గానీ ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించకపోవడమే.పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను నిశితంగా గమనిస్తే, బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు క్రమంగా బీజేపీ వైపు మళ్లినట్లు స్పష్టమైంది. గతంలో గులాబీ వైపు నిలిచిన అర్బన్, సెమి–అర్బన్, హిందూ ఓటర్లు గంపగుత్తగా కమలం వైపు మొగ్గు చూపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని తామే భర్తీ చేశామని, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ గట్టిగా చాటుకుంటోంది. ఇలాంటి తరుణంలో, తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి అసలు క్షేత్రస్థాయి బలం లేదని కేటీఆర్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ ఓట్లను లాగేసు కున్న బీజేపీని ధాటుగా ఎదుర్కోకుండా, కేవలం కాంగ్రెస్‌నే టార్గెట్ చేయడం పొలిటికల్ సర్కిల్స్‌లో పలు అనుమానాలకు తావిస్తోంది. బీజేపీపై సాఫ్ట్ పాలిటిక్స్ నడుపుతూ.. రేపటి ఎన్నికల్లో ఆ పార్టీనే మాకు ప్రధాన ప్రత్యర్థి అని చెప్తే ప్రజలు కన్విన్స్ అవ్వడం కష్టమేన్న అభిప్రాయం వినిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయకారీ ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో బీఆర్ఎస్ అధినాయకత్వం విఫలమవుతోంది. కవిత బెయిల్ వ్యవహారం దగ్గర నుంచి నేటి వరకు కేంద్ర సంస్థల దూకుడు తగ్గడం, పార్లమెంట్‌లో కీలక బిల్లులపై బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం వహించడం వంటి పరిణామాలు బీజేపీ–బీఆర్ఎస్ భాయ్ భాయ్ అనే రూమర్లకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. నిత్యం సోషల్ మీడియాలో, వార్తల్లో విలీనం లేదా పొత్తుల గురించిన రచ్చ జరుగుతూనే ఉంది. ఈ ప్రచారానికి శాశ్వతంగా చెక్ పెట్టాలంటే కేవలం ఆఫ్‌లైన్ ప్రకటనలు సరిపోవు, క్షేత్రస్థాయిలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆన్‌లైన్, ఆన్‌గ్రౌండ్ పోరాటాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక పెద్ద యాసిడ్ టెస్ట్. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలంటే.. అటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను అంతే తీవ్రంగా నిలదీయాలి. అలా కాకుండా కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే 100% ఫోకస్ పెట్టి, కేంద్రంపై చిన్న విమర్శ కూడా చేయకపోతే, ప్రజలు బీఆర్ఎస్‌ను కేవలం ఒక 'బి–టీమ్' గానే చూసే ప్రమాదం ఉంది. ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీలతో తలపడేటప్పుడు రెండు వైపులా సమానమైన దూకుడు ప్రదర్శించినప్పుడే పొలిటికల్ సీరియస్‌నెస్ కనిపిస్తుంది. కేటీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదనే విమర్శలు పోవాలంటే.. బీజేపీ హిడెన్ ఎజెండాను కూడా గులాబీ పార్టీ అంతే ధీటుగా బట్టబయలు చేయాలి. లేదంటే, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బీఆర్ఎస్ ఎంత మొత్తుకున్నా, విశ్లేషకులు గానీ, అటు ఓటర్లు గానీ దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి, సాఫ్ట్ పాలిటిక్స్ పక్కనబెట్టి తీవ్రమైన దూకుడు ప్రదర్శించడమే ఇప్పుడు కేటీఆర్ ముందున్న ఏకైక మార్గం.

# నిధుల్లేక నీరసిస్తున్న పాఠశాల పనులు

నల్గొండ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా చేపట్టిన 'మన ఊరు – మన బడి' బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాం లో చేసిన పనులకు సంబంధించి రూ. 300 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్.. గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు చెల్లించింది. విడుదల చేసిన దాంట్లోనూ రూ. 46 కోట్లు ఓ పెద్ద కంపెనీకే ఇచ్చిందని చిన్న కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పను లు చేపట్టి మూడేళ్లవుతున్నా బిల్లులు రాకపోవడంతో చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 9 వేల ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, నిర్మాణ పనులు చేపట్టింది. దాదాపు వెయ్యి మంది కాం ట్రాక్టర్లు ఈ పనులు చేశారు. డైనింగ్ హాల్, మ రుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్, ఎలక్ట్రికల్ వంటి మైనర్ పనులను చిన్న కాంట్రాక్టర్లు అప్పగించగా, పేయంటింగ్, స్మార్ట్ క్లాస్‌లకు సంబంధించి డిజిటల్ బోర్డులు ఏర్పాటు తదితర పెద్ద పనులను ఓ బడా కంపెనీకి ఇచ్చారు. వెయ్యి మంది కాంట్రాక్టర్లలో రూ.10 లక్షల లోపు పనులు చేసిన వారు 600 మంది వరకు ఉంటారు.ఇందులో రూ.5 లక్షల లోపు పనులు చేసిన వాళ్లకు దాదాపు రూ.141 కోట్లు, రూ.5– 10 లక్షల లోపు రావాల్సిన బిల్లులు రూ.75 కోట్లు, రూ.10–30 లక్షల లోపు రూ.75 కోట్లు, రూ.30 లక్షలకు పైగా రావాల్సిన బిల్లులు రూ. 50 కోట్లకుపైగా ఉంటాయి. మొత్తం కలిపి చిన్న కాంట్రాక్టర్లకు రూ.350 కోట్ల వరకు చెల్లించా ల్సి ఉంది. ఇందులో రూ.50 కోట్లు విడుదల చేయగా ఇంకా రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉం ది. బడా కంపెనీలకు రూ.650 కోట్లకు దాదాపు క్లియర్ చేసినట్లుగా ఓ కాంట్రాక్టర్ తెలిపారు. అప్పులు చేసి మరీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీ భారం పెరుగుతుందని చిన్న కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి రూ.100 కోట్లు చెల్లిస్తే మైనర్ పనులు చేసిన వారి సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. రూ.5 లక్షల లోపు బిల్లులకు కూడా మూడేళ్లుగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పెద్ద కాంట్రాక్టర్లకు దాదాపు 99 శాతం బిల్లులు క్లియర్ చేసిన ప్రభుత్వం.. తమకు రేపుమాపు అంటూ కాలయాపన చేస్తుందని అంటున్నారు. ప్రభుత్వాన్ని బిల్లులు అడిగితే డబ్బుల్లేవు, ఉన్నప్పుడు ఇస్తామని అంటుంది. ఎప్పుడు అడిగినా ఇదే మాట చెబుతుంది. గత ప్రభుత్వంలో కూడా బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఈ ప్రభుత్వంలో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తానని గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు ఇచ్చింది. ఇందులోనూ 90 శాతం వరకు ఓ బడా కంపెనీకే పోయాయి. ఈనెలలో మరో రూ.50 కోట్లు మంజూరు చేశామంటున్నారు. అవి ఇంకా జమ కాలేదు.

# రెండో విడత మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశం

- వచ్చిన దరఖాస్తులు కమిటీ సభ్యులతో చర్చించి ఆమోదం
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలో మీడియా అక్రిడేషన్ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెండో విడత అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., రెండో విడత జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో అందిన 237 దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించి, అర్హత ప్రమాణాలను పూర్తి చేసిన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. జర్నలిజం వృత్తి సమాజానికి బాధ్యతాయుతమైన సేవ అని, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించే విలేకరులకు ప్రభుత్వం కల్పిస్తున్న అక్రిడేషన్ సదుపాయాలు నిజమైన జర్నలిస్టులకే అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారుల సేవా వివరాలు, వార్తా ప్రచురణలు, సంస్థల ధృవీకరణ పత్రాలు, పని అనుభవం తదితర



అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎటువంటి ఒత్తిళ్లు, సిఫార్సులు లేదా వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా పూర్తిగా నిష్పాక్షికంగా కమిటీ సభ్యులు వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అక్రిడేషన్ వ్యవస్థపై జర్నలిస్టుల్లోనూ, ప్రజల్లోనూ విశ్వాసం పెరిగేలా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని చెప్పారు. జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశానికి నాగర్ కర్నూల్ ఆర్టీసీ డిఎం హాజరు కాకపోవడంతో కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పలు దరఖాస్తులపై తమ అభిప్రాయాలు వెల్లడించగా, అర్హతలు, సమర్పించిన పత్రాలు, స్థానిక స్థాయి ధృవీకరణ నివేదికలను పరిశీలిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కొన్ని దరఖాస్తులపై అదనపు సమాచారం సేకరించి తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి జె కిరణ్ కుమార్, జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు విజయ్ కుమార్, చంద్రశేఖర్ రావు, సురేష్ కుమార్, సాయిలు సాగర్, ప్రదీప్ కుమార్, వెంకట్ స్వామి, దస్తగిరి, మొహమ్మద్ ముబీన్ ఖాన్, శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# బంజారాహిల్స్ టూ పీవీఎక్స్ ప్రెస్ హైవే

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా కీలక కారిడార్లను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ సరికొత్త మౌలిక వసతుల ప్రాజెక్టును తలపెట్టింది. ప్రధాన నగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ప్రయాణం సాఫీగా సాగేలా సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1లోని జీవీకే వన్ మాల్ వద్ద ప్రారంభమై.. మాసబ్‌ట్యాంక్ మీదుగా ప్రస్తుతం ఉన్న పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుసంధానం చేసేలా సుమారు 4 కిలోమీటర్ల పొడవైన పైవంతెనను నిర్మించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి హెచ్ఎండీఏ ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే పనులను ప్రారంభించింది. రానున్న రెండేళ్ల కాలంలోనే ఈ కారిడార్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.ప్రస్తుతం నగరం నుంచి ఎయిర్‌పోర్టుకు వేగంగా చేరుకోవడానికి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులో ఉన్నప్పటికీ ప్రధాన నగరం నుంచి ఆ ఎక్స్‌ప్రెస్‌వేను చేరుకోవడమే ప్రయాణికులకు పెద్ద నరకంగా మారింది. ముఖ్యంగా రద్దీ వేళల్లో బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1, జీవీకే మాల్, తాజ్‌కృష్ణ, కేర్ ఆసుపత్రి, మాసబ్‌ట్యాంకు జంక్షన్లను దాటడానికి వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు ఈ కొద్దిపాటి దూరం దాటడానికే గంటల కొద్దీ సమయం పడుతుండటంతో విమాన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ వైపు ఇరువైపులా ట్రాఫిక్ సమస్యకు పెద్ద ఊరట లభించనుంది. బేగంపేట, సోమాజిగూడ నుంచి వచ్చే వాహనదారులు పంజాగుట్ట ఫ్లైఓవర్ ద్వారా నేరుగా ఈ కొత్త జీవీకే ఫ్లైఓవర్ ఎక్కి ఎక్కడా ఆగాల్సిన అవసరం లేకుండా ఆరాంఘర్ జంక్షన్‌కు, అక్కడి నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చు.ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం వ్యూహాత్మక ర్యాంపులను డిజైన్ చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 ప్రాంతంలో ఒక డౌన్ ర్యాంపును నిర్మించనున్నారు. ఇది ఎయిర్‌పోర్టు వైపు నుంచి వచ్చే వాహనాలు రోడ్డు నంబరు 10, 12 వైపు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. అలాగే ఖైరతాబాద్, సోమాజిగూడ నుంచి చింతల్‌బస్తీ మీదుగా రోడ్డునంబర్ 12 వైపు వెళ్లే వాహనాల కోసం చింతల్‌బస్తీ జంక్షన్ వద్ద ప్రధాన ఫ్లైఓవర్ కింద నుంచి మరో చిన్న పైవంతెన నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. ఇక లక్డీకపూల్, మాసబ్‌ట్యాంక్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలు కొత్తగా నిర్మించే ఫ్లైఓవర్ పైకి సాఫీగా వెళ్లేందుకు వీలుగా ఎన్ఎండీసీ భవనం ముందు ఒక అప్ ర్యాంపును ఏర్పాటు చేయనున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక త్వరలోనే సిద్ధం కానుందని హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. డీపీఆర్ రూపకల్పన పూర్తయిన తర్వాత ప్రాజెక్టుకు అయ్యే మొత్తం వ్యయం, భూసేకరణ అవసరాలు, ఇతర సాంకేతిక అంశాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పైవంతెన నిర్మాణానికి కృతనిశ్చయంతో ఉందని, నిధుల కొరత లేకుండా వేగంగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో పాటు పశ్చిమ హైదరాబాద్ ప్రజలకు సైతం ఎంతో వెసులుబాటు లభిస్తుంది.

# కేడర్ లో నిర్లేపం, నిక్షిప్తత

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతుంది. తాము సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని చంద్రబాబు, లోకేశ్ లు చెప్పుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం హామీల అమలు మాత్రం సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు మరో పదిహేనేళు తిరుగులేదంటూ జబ్బలు చరుచుకుంటున్నా జగన్ ను విమర్శించడమే పనిగా పెట్టుకుంది. నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందన్నది మాత్రం నాయకత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకత్వం గతంలో మాదిరిగా ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేయడం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే నివేదికలపైనే ఆధారపడి ఆల్ ఈజ్ వెల్ అని ఫీలవుతుంది.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడులు పెరిగాయి. పరిశ్రమలు వస్తున్నాయి. అందులో ఎవరూ కాదనలేరు. కానీ ఎవరూ అభివృద్ధిని చూసే ఓటేయరు. సంక్షేమం అందరికీ అందడం లేదు. నిధుల కొరత కారణంగా, అధికారులు కొర్రీలు పెడుతూ చాలామందికి కోతలు పెట్టారు. హామీలు అన్ని అమలు పర్చామంటూ డప్పాలు కొట్టుకుంటే సరిపోదు. జనం ఏమనుకుంటున్నారో తెలుసుకుంటే చాలు జరుగుతున్న తప్పులు సరిదిద్దుకునే ప్రయత్నం చేయవచ్చు. ఎమ్మెల్యేల సమావేశం పెట్టినా, కార్యకర్తలతో మీటింగ్ లు పెట్టినా చెప్పడమే తప్ప వినడం తక్కువ కావడంతో వారి నుంచి ఫీడ్ బ్యాంక్ తీసుకోకపోవడమే ప్రధాన సమస్య. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తమ సమస్యలన్నీ తీరతాయి భావించిన కార్యకర్తలకు నిరాశ ఎదురవుతుంది.మరొకవైపు కాలరెత్తుకుని కార్యకర్తలు తిరగొచ్చని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని ప్రజలకు చెప్పమని చంద్రబాబు అంటున్నా సగటు తెలుగుదేశం కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. నిన్నా మొన్నా వైసీపీ నుంచి వచ్చి చేరిన వారికి లభించే గౌరవం కూడా తమకు దక్కడం లేదంటూ నిట్టూరుస్తూన్నారు. ఆవేదనకు రెండేళ్లు, అసంతృప్తికి రెండేళ్లు, అంటూ తమలో నివురుగప్పిన నిప్పులా దాగున్న బాధను పంటికింద భరిస్తూ, లేని ఆనందాన్ని ముఖంలో నింపుకుంటూ ప్రజల్లోకి వెళ్లేదేలా? అని మనసులోనే కుమిలి పోతున్నారు. కక్కలేక మింగలేక మౌనం పాటిస్తున్నారు.

# హ్యాట్రిక్ పై యోగి గురి

లక్నో : భారత రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్తరప్రదేశ్ లో ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ రికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. గతంలో లాగా కాకుండా, ఈసారి ఎన్నికలకు ముందే యోగి ఆదిత్యనాథ్ తామే సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగుతారని పార్టీ జాతీయ నాయకత్వం అధికారికంగా ప్రకటించడం గమనార్హం. గత లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సాధించిన విజయాలకు బ్రేక్ వేయడమే కాకుండా, విపక్షాల ఓటు బ్యాంకును ముక్కలు చేసేందుకు యోగి మార్క్ పొలిటికల్ స్కెచ్ సిద్ధమైంది.అఖిలేష్ యాదవ్ విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చిన ఖఅం పిచ్డే, దళిత్, అల్పసంఖ్యాక్ – వెనుకబడిన, దళిత, మైనారిటీల కూటమి ఫార్ములాను దెబ్బతీయడమే యోగి ప్రధాన ఎజెండా. దీనికోసం ఇటీవల యూపీ క్యాబినెట్‌ను విస్తరిస్తూ ఆరుగురు కొత్త మంత్రులతో యోగి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ విస్తరణ వెనుక పక్కా సోషల్ ఇంజనీరింగ్ దాగి ఉంది. సమాజ్ వాదీ పార్టీ బలంగా నమ్ముకునే యాదవేతర ఓబీసీ , దళిత సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో పెద్దపీట వేయడం ద్వారా అఖిలేష్ యాదవ్ ఓటు బ్యాంకు పునాదులను కదిలించేలా యోగి వ్యూహాత్మక అడుగులు వేశారు. ఎస్పీ సాంప్రదాయ ఓటు బ్యాంకు అయిన యాదవేతర వెనుకబడిన కులాలను తమ వైపు తిప్పుకోవడం ద్వారా అఖిలేష్ ఖఅం ముసుగును తొలగించాలని యోగి ప్లాన్ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీలో యాదవుల ఆధిపత్యంపై అసంతృప్తిగా ఉన్న ఇతర ఓబీసీ ఉప–కులాలను మౌర్య, కుర్మీ, నిషాద్, రాజ్‌భర్ వంటి వర్గాలను బీజేపీ తన వైపు తిప్పుకుంటోంది. ఇందుకోసం చిన్న చిన్న ప్రాంతీయ పార్టీలతో పొత్తులను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఆయా సామాజిక వర్గాల చివరి లబ్ధిదారుడికి చేరేలా యోగి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కుల సమీకరణాలతో పాటు రాష్ట్రాన్ని కుదిపేసే క్రైమ్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని ఉక్కుపాదంతో అణచివేయడం ద్వారా శాంతిభద్రతల అంశాన్ని మరోసారి తన ప్రధాన ఆయుధంగా మలుచుకుంటున్నారు.ఇక రాజకీయంగా విపక్షాలను డిఫెన్స్‌లో పడేసేందుకు యోగి ఆదిత్యనాథ్ మరోసారి తన పాత వైభవమైన 'హార్డ్ హిందుత్వ' అస్త్రాన్ని ప్రయోగించారు. ఇటీవల కుషీనగర్, గొండాలలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన నేరుగా సమాజ్ వాదీ పార్టీని రామ విరోధులు గా అభివర్ణించారు. కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు దశాబ్దాల పాటు అయోధ్య రామమందిర నిర్మాణాన్ని అడ్డుకున్నాయని, 500 ఏళ్ల హిందువుల నిరీక్షణకు డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే ముగింపు పలికిందని గుర్తు చేశారు. అఖిలేష్ యాదవ్ ఇటీవల అవలంబిస్తున్న సాఫ్ట్ హిందుత్వ పాలిటిక్స్‌ను యోగి తీవ్రంగా ఎండగడుతున్నారు. అభివృద్ధి జాతీయ భద్రత అనే అంశాలను కూడా యోగి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు.

# హార్టికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి :** కొల్లాపూర్ పట్టణానికి ఇటీవల మంజూరైన హార్టికల్చర్ యూనివర్సిటీ మరియు పాలిటెక్నిక్ కళాశాలల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూముల స్థలాలను జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత స్థలాల భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం, విద్యాసంస్థల నిర్మాణానికి అనుకూలత, భవిష్యత్ విస్తరణ అవకాశాలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకులు మరియు ఇతర సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తగిన స్థలాలను ఎంపిక చేయాల్సిన అవసరాన్ని, అలాగే భవిష్యత్‌లో విద్యాసంస్థల విస్తరణకు అవకాశం ఉండేలా ప్రణాళికాబద్ధంగా భూములను కేటాయించాలని, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,...... హార్టికల్చర్ యూనివర్సిటీ మరియు పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు వల్ల కొల్లాపూర్ ప్రాంతంలో విద్యా, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ రంగమైన హార్టికల్చర్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు రైతులకు చేరువ కావడానికి ఈ విశ్వవిద్యాలయం దోహదపడుతుందని





అన్నారు. భూసేకరణ, స్థలాల బదిలీ, అనుమతుల మంజూరు వంటి ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా సంస్థల ఏర్పాటుతో కొల్లాపూర్ పట్టణం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందడంతో పాటు ప్రాంతీయ పురోగతికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డిఓ బన్సీలాల్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాషా, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు .




సినిమా నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టడం వల్ల ఇండస్ట్రీ లోకి వచ్చే అవకాశాలు సులభంగా రావచ్చు, కానీ అది పెద్ద స్టార్ అవ్వడానికి గ్యారెంటీ ఇవ్వలేదు. ఎక్కువ కాలం సక్సెస్ సాధించాలనేది ఒక నటుడి సొంత నిర్ణయాలు, కష్టపడే గుణం, స్క్రీన్ మీద కనిపించే తీరు, ప్రేక్షకులకు నచ్చేలా నటించే నైపుణ్యంపైనే ఆధారపడి ఉంటుంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రయాణం దీనికి ఒక మంచి ఉదాహరణ. తన కెరీర్ మొదట్లో 'చిరుత, మగధీర, నాయక్, ఎవడు, ధృవ' వంటి రకరకాల సినిమాలతో చరణ్ ఒక నమ్మకమైన కమర్షియల్ హీరోగా పేరు తెచ్చుకున్నారు. అయితే 'రంగస్థలం, ఇటీవల వచ్చిన 'పెద్ది' సినిమాలు ఒక యాక్టర్‌గా ఆయనలోని సరికొత్త నటనను ప్రపంచానికి చూపించడమే కాకుండా, చరణ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ముఖ్యంగా, ఈ సినిమాలు రివ్యూల పరంగా మంచి ప్రశంసలు అందుకోవడమే కాకుండా ఆయన కెరీర్‌లోనే అతిపెద్ద హిట్లుగా నిలిచాయి. అదే సమయంలో, మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్ కలిసి ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక అరుదైన రికార్డును సృష్టించారు. ఒకే సంవత్సరంలో తండ్రి, కొడుకు విడివిడిగా నటించిన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్ల కంటే ఎక్కువ వసూళ్లను సాధించడం భారతీయ సినిమా ఇండస్ట్రీలోనే ఇదే మొదటిసారి. ఈ ఏడాది సంక్రాంతి పండుగకు వచ్చిన చిరంజీవి 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమా బాక్సాఫీస్ దగ్గర ఈ మైలురాయిని దాటగా, తాజాగా రామ్ చరణ్ నటించిన 'పెద్ది' సినిమా థియేటర్లలో భారీ వసూళ్లతో దూసుకుపోతూ ఈ పెద్ద మార్కును దాటేసింది. ఈ అద్భుతమైన రికార్డుతో మెగా ఫ్యామిలీ సరికొత్త చరిత్రను సృష్టించింది. భారతీయ సినిమా ఇండస్ట్రీలో తరతరాలుగా ఎంతోమంది నటీనటుల కుటుంబాలు ఉన్నప్పటికీ, ఏ తండ్రీకొడుకుల కాంబినేషన్ కూడా ఒకే సంవత్సరంలో ఇంతటి భారీ బిజినెస్ విజయాన్ని అందుకోలేదు. ఈ గొప్ప ఘనతతో పాటు, రామ్ చరణ్ నటించిన 'పెద్ది' సినిమా కేవలం పది రోజుల్లోనే చిరంజీవి 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమా మొత్తం కలెక్షన్లను చాలా ఈజీగా బీట్ చేసింది. అన్ని ఏరియాల్లో, అన్ని వర్గాల ప్రేక్షకుల్లో ఈ సినిమాకు వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్, రామ్ చరణ్ బాక్సాఫీస్ స్టామినాకు ఈ కలెక్షన్ల సునామీ ఒక స్పష్టమైన నిదర్శనం. ఈ అసాధారణ విజయం మెగా వారసత్వాన్ని సినిమా రంగంలో మరింత గట్టిగా నిలబెట్టడమే కాకుండా, రామ్ చరణ్ తన తండ్రి ఇమేజ్ నుంచి బయటకు వచ్చి సొంతంగా గ్లోబల్ మార్కెట్‌ను ఏలగలరని నిరూపించింది. ఒకే సంవత్సరంలో తండ్రీకొడుకులిద్దరూ కలిసి బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తూ, సినిమా చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే కొత్త అధ్యాయాన్ని రాశారు. వారసత్వంగా వచ్చిన పేరును బాధ్యతగా వాడుకుంటూ, కష్టపడే గుణంతో రామ్ చరణ్ సాధిస్తున్న ఈ విజయాలు ఆయనను నేటి తరం టాప్ హీరోల వరుసలో నిలబెట్టాయి.







కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, ఆర్జే బాలాజీ కాంబినేషన్‌లో వచ్చిన 'కరుప్పు' సినిమా బ్రహ్మాండమైన విజయాన్ని అందుకుని రూ. 300 కోట్ల కలెక్షన్స్‌ను బీట్ చేసింది. ఈ సినిమాకు ముందు సూర్య వరుస పరాజయాల్లో ఉన్న విషయం తెలిసిందే. దీంతో 'కరుప్పు' సక్సెస్‌ని సూర్య గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సినిమాకు మెయిన్ సాంకేతిక నిపుణులైన వారందరికీ సూర్య కారు గిఫ్ట్‌గా ఇచ్చారంటే.. ఈ సక్సెస్ సూర్యకు ఎంత సంతోషాన్ని ఇచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అంతా బాగానే ఉంది కానీ, ఈ సినిమా అనుకున్న టైమ్‌కి రిలీజ్ కాకపోవడానికి, అన్నీ సెట్ చేసుకుని రేపు రిలీజ్ అనగా ఆలస్యంగా విడుదలవడానికి కారణం ఏంటో అందరికీ తెలుసు. కానీ, అన్ని రిలీజ్ ప్రాబ్లమ్స్‌ని ఫేస్ చేసిన తర్వాత.. సినిమా థియేటర్లలోకి రావడానికి కూడా చాలా మంది సహకారం ఉందని ప్రముఖ డిస్ట్రిబ్యూటర్, ఫైనాన్షియర్ తిరుప్పూర్ సుబ్రమణ్యం వెల్లడించడంతో.. 'కరుప్పు' విడుదల వెనుక ఇంత ఫైనాన్షియల్ వార్ జరిగిందా? అని అంతా ఆశ్చర్యపోతారు. రిలీజ్ రోజు కూడా ఈ సినిమా చాలా ఆలస్యంగా విడుదలైంది. అప్పటికప్పుడు కొందరు ఫైనాన్షియర్స్ సపోర్ట్ చేయడం వల్లే.. ఈ సినిమా సాఫీగా విడుదలైందని ఆయన చెప్పుకొచ్చారు. అంతేకాదు, ఈ సినిమా విడుదలకు సహకరించిన వారందరి గురించి ఆయన చెప్పుకొచ్చారు. సినిమా ఆగిపోతుందని తెలిసి.. అందరికంటే ముందు సూర్య రియాక్ట్ అయ్యారని.. కానీ అక్కడున్న ఇబ్బందులు తను చేయగలిగిన దానికంటే ఎక్కువ ఉండటంతో.. ఆయన చేయగలిగింది చేశారని తెలిపారు. నిర్మాత ఎస్ఆర్ ప్రభు, ఇతర యూనిట్ అంతా సినిమా విడుదల ఆగిపోవడంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని, ఆ సమయంలో అరుళ్‌భాతి ఎంతగానో సహాయం చేశారని గుర్తు చేశారు. ఆయనకు ఈ సినిమాతో ఎలాంటి సంబంధం లేకపోయినా, సినిమా విడుదల కోసం ఫైనాన్షియర్స్‌తో చర్చలు జరిపిన విధానం మాత్రం చాలా గొప్పదని పేర్కొన్నారు. ఆయన చెప్పడం వల్లే.. తను, ఆర్‌బి చౌదరి వెనక్కి తగ్గామని అన్నారు. అరుళ్ భాతి విజ్ఞప్తితో తామంతా 70 శాతం వరకు తగ్గించుకుని, తర్వాత సినిమాల్లో సర్దుబాటు చేసుకుంటామని తెలిపినట్లుగా ఆయన వెల్లడించారు.అన్నీ సర్దుకున్నాక కూడా ఈ సినిమాకు రూ. 5 కోట్లు అవసరమైందని, అప్పుడు సూర్య తరపున రాజశేఖర్ పాండియన్, దర్శకుడు హెచ్. వినోద్ వంటి వారు అమౌంట్ సర్దుబాటు చేశారని తిరుప్పూర్ సుబ్రమణ్యం తెలిపారు.




టాలీవుడ్‌లో ఒకప్పుడు గ్లామర్‌తో, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారు గుండెల్లో 'చందమామ'లా వెలిగిపోయింది కాజల్ అగర్వాల్. పెళ్ళి తర్వాత సినిమాలకు బ్రేక్ ఇచ్చిన కాజల్... ఇటీవలే సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించి రూట్ మార్చింది. కేవలం సాంగ్స్, రొమాన్స్ అనే పాత ఫార్ములాకు గుడ్ బై చెప్పేసి బాక్సాఫీస్ దగ్గర గట్టిగా ఇంపాక్ట్ చూపించే పవర్‌ఫుల్ పాత్రలపై కన్నేసింది. తాజాగా వినిపిస్తున్న క్రేజీ అప్‌డేట్ చూస్తుంటే.. కాజల్ బాక్సాఫీస్ రేస్‌లోకి మళ్ళీ స్పీడుగా దూసుకొస్తోందని అర్థమవుతోంది. 'స్వామి రారా' ఫేమ్ సుధీర్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న 'విశాఖ' వెబ్ సిరీస్‌తో కాజల్ ఓటీటీ వరల్డ్‌ను షేక్ చేయడానికి రెడీ అవుతోంది. ఇందులో విశేషం ఏంటంటే.. ముద్దుగుమ్మ ఒకే సిరీస్‌లో రెండు భిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలు చేస్తోంది. ఒక వైపు అమాయకమైన గృహిణిగా కనిపిస్తూనే.. మరోవైపు గన్ పట్టిన 'లేడీ డాన్'గా రౌడీల గుండెల్లో వణుకు పుట్టించబోతోంది. సుస్మితా సేన్ 'ఆర్య' తరహాలోనే.. ఈ 'విశాఖ' కూడా మైండ్ బ్లోయింగ్ యాక్షన్ డ్రామాగా సాగనుందని ఇండస్ట్రీ టాక్.

ఇప్పటికే 'విశాఖ' షూటింగ్ పూర్తి చేసుకున్న కాజల్.. జులై లేదా ఆగస్టులో జియో హాట్‌స్టార్ ద్వారా మన ముందుకు రానుంది. అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్స్, మైండ్ గేమ్‌తో సాగే ఈ సిరీస్.. కాజల్ కెరీర్‌లోనే బెస్ట్ గా నిలుస్తుందంటున్నారు మేకర్స్. మొత్తానికి గ్లామర్ క్వీన్ కాస్తా ఇప్పుడు 'యాక్షన్ క్వీన్'గా మారుతుంటే.. అభిమానుల ఆనందానికి అవధులు లేవు. మామూలుగానే సీనియర్ హీరోయిన్లు సెకండ్ ఇన్నింగ్స్‌లో కాస్త సేఫ్ జోన్ వెతుక్కుంటారు. కానీ కాజల్ మాత్రం ఛాలెంజింగ్ రోల్స్ తో రిస్క్ తీసుకోవడానికి ముందుకొచ్చింది. ఆ మధ్య 'సత్యభామ'లో పోలీస్ ఆఫీసర్‌గా రఫ్ అండ్ టఫ్ లుక్‌లో మెప్పించిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు బాలకృష్ణ – గోపీచంద్ మలినేని కాంబో మూవీలోనూ మెయిన్ లీడ్‌గా నటిస్తూ బిజీగా ఉంది. మొత్తానికి అటు సినిమాలు ఇటు వెబ్ సిరీసులతో ఫామ్ లోకి వచ్చేందుకు గట్టిగానే కష్టపడుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.




లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వచ్చిన గోల్డెన్ బ్లాక్ బస్టర్ 'సింగ్ గీతం' చిత్రానికి ప్రశంసలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. మెగాస్టార్ చిరంజీవి , పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రాన్ని వీక్షించిన యంగ్ టైగర్ ఎన్టీఆర్. చిత్ర బృందాన్ని అభినందిస్తూ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్‌గా రియాక్ట్ అయ్యారు. సింగ్ గీతం' చిత్రం హృదయాన్ని తాకే అద్భుతమైన సినీ అనుభూతి అని పేర్కొన్న ఎన్టీఆర్.. 94 ఏళ్ల వయసులో కూడా సింగీతం శ్రీనివాసరావు సృజనాత్మకత, కథల పట్ల ఉన్న తపన, ఆలోచనా విధానం ఎంతగానో ఆశ్చర్యపరిచాయని పేర్కొన్నారు. తరతరాల సినీ అభిమానులకు ఆయన ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తూనే ఉంటారని కొనియాడారు. ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత నాగ్ అశ్విన్‌ను ఎన్టీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. దశాబ్దాలుగా సింగీతం కలగా ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను తెరపైకి తీసుకురావడం చాలా గొప్ప విషయమని, భారతీయ సినీ చరిత్రలో అత్యంత వినూత్న దర్శకుల్లో ఒకరైన సింగీతం లెగసీకి 'సింగ్ గీతం' అందమైన నివాళిగా నిలిచిందన్నారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085